# పావనమూర్తి

మసక చీకటి మాయలతో వేకువ వెలుతురు రెక్కలు విప్పలేకపోతోంది. తెల్లవారకముందే తుఫాను హెచ్చరిక తుఫానులా వచ్చేసింది. లోతట్టు ప్రాంతాలవారు తరలివెళ్ళాలని దూరదర్శన్ చెవులు తట్టి చెబుతోంది.

సముద్రంలో అల్ప పీడనం ఆవులించినా, తుఫాను తన్నుకొచ్చినా సముద్ర తీరవాసుల కిదంతా మామూలేకదా ! ఇలాంటి వెన్నిసార్లు రాలేదు, పోలేదు ! ఎప్పట్లాగే లోతట్టు ప్రాంతాల జనాలు లబలబలాడుతూ తట్టాబుట్టలతో పరుగుదీస్తున్నారు.

ఎవరెట్లా బోతే నాకేం ! నాది పక్కా బంగళా, ఎత్తు మీదుంది. ఇతరుల సుత్తి నాకెందుకూ? మెత్తని బ్రష్ పళ్ళుతోముతూంటే... సుతిమెత్తగా ఆలోచిస్తూ బజార్లో బెంబేలెత్తి పోతున్న బడుగు జీవుల్ని బంగళా మీంచి చూస్తున్న పావనమూర్తి కదో వింత అనుభూతి.

చెట్టంత కొడుకును కోల్పోయిన తల్లిలా సముద్రం రొద.... అప్పటి కప్పుడే ఆకాశం మేఘావృతం.... ఉన్నట్టుండి పర్వతాలు కూలిపోతున్నట్లు ఫెళఫెళార్భాటాలు... చెవి గూబలు చిట్లి పోతాయేమో ! తూరుపువాకిలి దాటబోతున్న సూర్యుడు ఝుడుసుకుని మబ్బుపరదాల్లో కెళ్ళిపోయాడు. సిద్ధాంతాలకు కొరుకుడు పడని రాజకీయ నాయకుడు డ్రెస్సు మార్చినట్టు పార్టీ మార్చి ఎన్నికల బరిలోకి దిగినట్టు క్షణంలో ఆకాశం రంగులు మార్చి నల్లని కొండైంది. ఉరుములు, మెరుపులు... పావనమూర్తి పళ్ళుతోమడం పూర్తవకముందే కుంభవృష్టి ప్రారంభమైంది. ఆదరబాదరాగా ముఖ ప్రక్షాళన ముగించగానే కాఫీ గుర్తుకొచ్చింది. చకచకామెట్లు దిగుతూంటే భార్యాపిల్లలక్కడే ఎదురయ్యారు.

"నీళ్ళండీ నీళ్ళు ! ఇంటి నిండా నీళ్ళొచ్చినై." ఎవరో తరుముకొస్తున్నట్టు అన్నపూర్ణ అంగలేస్తూ మెట్లెక్కింది.

"బజారు నిండా నీళ్ళే నాన్నా ! వామ్మో !..." పదిహేడేళ్ల సంతోషి వోణీ సవరించుకుంటూ తల్లిననుసరించింది.

"నా పుస్తకాలూ, బంతీ అన్నీ పోతున్నై నాన్నా !" పన్నెండేళ్ళ ప్రహ్లాద్ పడుతూ లేస్తూ పైకెళ్ళాడు.

"అమ్మో... నాన్నా... ఇక్కడిగ్గూడా నీళ్ళు నాన్నా !" ఎనిమిదేళ్ళ గిరిజ వణికిపోతూ వాటేసుకుంది.

ఔను... కాళ్ళకు తడి... అరెరే.... నీళ్ళు పైకొచ్చేస్తున్నాయ్ ! గుండె గుభేళ్మంది. వాటేసుకున్న చిన్న కూతుర్ని వాటంగా ఎత్తుకుని గబగబా మెట్లెక్కాడు.

కిటికీలోంచి కనబడ్తోంది. ఊరు నిండా నీళ్ళే... అయ్యో ! ఊరు సముద్రమైపోతుందే ! ఊళ్ళో ఇళ్ళేవీ ? తనింటి చుట్టూ గూడా నీళ్ళే. ఇది స్వప్నావస్థ కాదుగదా ! ఒళ్ళు గిల్లుకున్నాడు. నిజమే. కాళ్ళు కడుపులోకి చొచ్చుకుపోతున్నె.

ఆందోళన... బార్యా పిల్లలు బోర్‌మని రాగాలందుకున్నారు. ఆపాదమస్తకం వణికి పోతోంది. వాళ్ళతో శృతి కలిపాడు.

"ప్రాణాలు పోసే గంగమ్మ తల్లీ ! ప్రాణాలు తీస్తున్నావా ? ...." గట్టిగా అరిచాడు పిచ్చిగా గీపెట్టాడు. అంతా ఒకేసారి అరిచారు. సముద్రం భోరులో ఇదెంత ? కిటికీ రెక్కల దడదడల్లో కలిసిపోయింది.

"అబ్బో... అమ్మో... నీళ్ళు ఇక్కడిగ్గూడా వచ్చాయండీ ! పదండి డాబా పైకి" ఇద్దరు పిల్లల్నీ రెక్కపుచ్చుకుని పైకెల్తోంది అన్నపూర్ణ. సంతోషి తల్లి వెంటుంది.

"పైన వర్షం పూర్ణా ! కుంభవర్షం ..."

"ఐనా స్సరే... మ్మ.... మీరు త్వరగా వచ్చెయ్యండి..."

పాదాలు నీళ్ళల్లో మునిగిపోయినై. అరక్షణంలో మోకాళ్ళనంటినై... ప్రాణాలరచేతికొచ్చినై. పరుగెత్తక తప్పలేదు.

హమ్మనాయనోయ్ ! జలప్రళయం జవసత్వాల గురించి పురాణాల్లో వినడమేగాని ఇప్పుడు ప్రత్యక్షంగా... వెన్నుపూసలోని వణుకు నరాలన్నింటికీ వ్యాపించింది.

చిమ్మ చీకట్లో దమ్మక్కదయ్యమన్నటుంది. అంధకారం, అయోమయం.... మెరుపు వెలుతుర్లో ఒకరి నొకరు చూచుకుంటూ ఒక్కచోట కూచున్నారు. టపటపటపటప.... పై నుండి పలుగురాళ్ళ వర్షం. ఝుంయ్...ఝుంఝుంయ్య్... పక్కల నుండి ఝుంఝూమారుతం. చినుకులు కావవి, మొనదేలిన ములుకత్తులు.

ఇంకేముంది ! ఇంకాస్సేపట్లో జలసమాధైపోతాము. బతికున్నన్ని రోజులు చిన్నారి నా పొట్ట శ్రీరామరక్ష అనుకున్నాను. ఒక్క పుణ్యకార్యం గూడా చెయ్యలేదు. మా పాపపు శవాలను తిమింగళాలు గూడా తాకవు. ఒడ్డుకు కొట్టుకు పోయాక కుక్కలు నక్కలు పీక్కుతింటాయి. కాకులు గద్దలు పొడుచుకు భోంచేస్తాయి. పున్నామ నరకం నుండి తప్పించాల్సిన పుత్రుడు గూడా... ప్చ్... ఇహ పిండ ప్రదానం చేసేదెవ్వరూ? పావనమూర్తి ఎద కరిగి పారుతోంది. వెచ్చని కన్నీటి ధార పెదాలకు ఉప్పగా తాకింది.

ఆడదాన్నై పుట్టినందుకు అడవిలో ఆముదం చెట్టులా పెరిగానే గాని ఎన్నడన్నా, ఏదన్నా వ్రతం చేశానా ? నోము నోచానా ? డబ్బు కూడబెట్టి డాబుగా ఉండాలన్న ఆలోచన తప్ప దాన ధర్మాలు చెయ్యాలన్పించిందా ? అన్నపూర్ణ అంతరంగ తరంగాల్లో ఆగని కల్లోలం. రోజంతా గడిచింది.

హోరు గాలి, జోరు వాన. మనసు పోరు... నరకం...ప్రత్యక్ష నరకయాతన... రాత్రి... పొడగాటి రాత్రి.... చాంతాడంత రాత్రి.... ఎలా గడిచిందో !

ఎక్కడో సూర్యోదయమైనట్టుంది. సన్నని వెలుతురు తెరలు తెరలుగా విచ్చుకుంటోంది. చావుదెబ్బలు వడ్డించిన చినుకుల్లో పదును తగ్గింది. ఒళ్లంతా హూనమైపోయింది. నేలమీద అరచేతులానించి లేచి పిట్టగోడ చేరాడు పావనమూర్తి. నీటి మట్టం కొంత తగ్గింది. ఇళ్ళ కప్పులు కనబడుతున్నై. ఆహా ! పై కప్పుల మీద జనాలున్నారే !... ప్రాణులెందరో, అప్రాణులెందరో ! అరుపులు, పెడబొబ్బలు, హాహాకారాలు, అంగలార్పులు... అయోమయం.

"మనం బతికే ఉన్నామండీ !" వెనుక నుండి వచ్చి వీపు తట్టింది అన్నపూర్ణ. "పదండి గదిలోకెల్దాం దిగండి."

వజవజ వణుకుతూ పిల్లలు వెంబడించారు. గదుల్లోంచి అన్నీ ఊడ్చుకుపోయినై. బీరువా అలాగే ఉన్నా మంచాలు అడ్డదిడ్డమైపోయినై. చిలక్కొయ్యల డ్రెస్సులూ, పరుపులూ, పక్కబట్టలూ, టీవీ, రేడియో... ఏవీ లేవు. బార్యా భర్తలు కిందికొచ్చారు. గదుల్లో ఇంకా నీరుంది. వంట సామాగ్రి, తినుబండారాలు మచ్చుకైనా లేవు. తలబాదుకున్నారు. ఒకరినొకరు ఆసరాగా పైకొచ్చారు.

"అమ్మా ... ఆకలే !" ప్రహ్లాద్, గిరిజల బలహీన స్వరం.

ఎముకలు చప్పరిచ్చేస్తున్న చలి భరించలేక తన చేతుల్ని తానే చుట్టేసుకుంది పెద్దకూతురు.

"ఇప్పుడెట్లా నాన్నా !" వెక్కి వెక్కి ఏడుస్తూ కూలబడింది.

మరోసారి ఇల్లంతా వెతికింది అన్నపూర్ణ. తినేందుకేమీ లేదు. బీరువా తెరిచాడు పావనమూర్తి. తడిసిన నోట్ల కట్టలు, ముడివీడని నగల మూటలు వెక్కిరిస్తున్నై. ఈ నగలన్నీ తాకట్టులో దక్కినవే. చక్రవడ్డీలు కట్టలేని బీదల కన్నీరే సముద్రమై పొంగుకొచ్చిందేమో ! ఆకలి తీరే ఆనవాలేవీ ?

కిటికిలోంచి బయటికి దృష్టి సారించాడు. నీటిమట్టం తగ్గుతోంది. హాహాకారాలు, అంగలార్పులు ద్విగిణీకృతమైనై. మృత్యుదేవత కరాళ నృత్యం ఎందర్ని మింగేసిందో ! ఊళ్ళో మిగిలిందెవరో ! పరిస్థితి మామూలై పోతుందా లేక సముద్రం మళ్ళీ పొంగి యుగాంతమై పోతుందా?

ఆకలి నకనకలు. ప్రకృతి పకపకలు. ధైర్యం కకావికలు. మధ్యాహ్నమైనట్టుంది. నూనె అందని వత్తుల్లా, ఆరిపోతున్న దీపాల్లా... పిల్లల్ని చూస్తొంటే గుండె తరుక్కుపోతోంది.

"అమ్మా .... ఆ... క... లే... !" గిరిజ రసం పిండేసిన చెరుకు గడలా పడుంది.

"అయ్యో రామా !" గిరిజను లేవనెత్తి గుండెలకు హత్తుకుంది అన్నపూర్ణ. "చిన్నపిల్లకు జ్వరమండీ!" మరోసారి గొల్లుమంది.

"తమ్మునిగ్గూడా నాన్నా !" ప్రహ్లాద్ నుదుటి మీద చెయ్యేసి చటుక్కున లాక్కుంది సంతోషి.

ఏం చెయ్యాలి ? ఎటు బోవాలి ?

చీకటి... మళ్ళీ చీకటి తెరలు... కాళరాత్రి హోరుమంటున్న కడలి కెరటాలు... రారమ్మంటున్న మృత్యుహేల...

"రామా... కృష్ణా... భగవంతుడా !" పావనమూర్తి జీవితములో అరుదైన దైవస్మరణ... గుండెలు చీల్చుకు వచ్చింది.

మళ్ళీ తెల్లవారింది. మెట్లు దిగి కిందికొచ్చాడు. వీధుల్లో మోకాలిమంటి నీరుంది. ఒళ్ళంతా పచ్చి పుండైంది. పిల్లల్ని చూస్తే పిచ్చెక్కుతుంది. ధైర్యమంతా కూడదీసుకుని డాబా చేరుకున్నాడు.

మూడోరోజు ముసురు మిగిలింది.

భంయ్... ఝుంయ్... భంయ్య్య్య్... గగన వీధుల్లో హెలీకాప్టర్.... ఓఫ్ ! ఆహార పొట్లాలు. ఆహ్ ! కావాలి... రావాలి... డాబా మీద రాలాలి... ఆశా... అత్యాశా.

కడుపులో ఎలుకల పరుగులు... హెలీకాప్టర్ చెక్కర్లు... పొట్లాలు వచ్చేస్తున్నై... అయ్యో... నీళ్ళల్లో రాల్తున్నై. తెగించాలి... తప్పదు. పిట్టగోడ నుంచి వంగి చాచిన రెండు చేతులకు ఒకే పొట్లం తాకింది. వేళ్ళ కానుకుని పడబోతోంది. లపుక్కున్న లాక్కున్నాడు. చినిగి సగమైంది. హమ్మయ్య... ఈ మాత్రమన్నా దక్కింది. ఆదరాబాదరాగా నోట్లో కుక్కుకున్నాడు. రెండు బుక్కలు కూడా కాలేదు. మింగేశాడు తాగేందుకు నీళ్ళేవీ ? వాన నీటి కోసం దోసిలి విచ్చుకుంది. ప్చ్... ఇది ముసురేనాయె... తడిచిన గుడ్డలారేసుకోవాలి. చకచకా మెట్లు దిగాడు.... భార్యా పిల్లలు నిస్త్రాణగా పడున్నారు.

అరెరే ! ఆ కాస్త పొట్లాన్నైనా మనిషో ముద్దగా అందిస్తే బాగుండేదేమో ! ఛీఛీ... పాపపు జన్మ... తలబాదుకుంటూ మళ్ళీ డాబా పైకెళ్ళాడు. ముసురు తగ్గింది. నాల్గువైపులా చూపులు పరుగులు దీసినై. ఉత్తరాన, ఊరి బయట జనాలున్నారు. అమ్మో ! ... అక్కడ మంటలు... వంటలు తయారౌతున్నాయ్ ! అది తన బంగళా కంటే చాలా ఎత్తైన ప్రదేశము. అక్కడుంటున్నది నర్సింలు.. వాడు... ఆ నర్సింలు -

పది సంవత్సరాల క్రితం మెదకు జిల్లాను కరువు కాటేసింది. మెదకులో మెతుకు కరువైందని పొట్ట చేత పట్టుకుని, పెళ్ళాం దేవమ్మను వెంట బెట్టుకొని ఈ ఊరికొచ్చాడు. రైతు కూలీగా స్థిరపడ్డాడు. ఎండనకా, వాననకా భార్యా భర్తలు రెక్కలు ముక్కలు చేసుకున్నారు. పాత ఇల్లు కొనుక్కున్నారు. కాని... దేవమ్మకు మొదటి కాన్పు కష్టమైంది. పల్స్ చూచి పట్నం తీసుకెళ్లమన్నాడు వైద్యుడు. కాళ్ళా వేళ్ళాపడి తనవద్ద అప్పు తీసుకున్నాడు. అప్పటికే ఆలస్యమైందేమో... పట్నం డాక్టర్ పెద్దాపరేషన్ చేసి తల్లిని బతికించిందిగాని పిల్లను దక్కించలేకపోయింది. రోగాలు రొష్టులు. రెండేళ్ళు గడిచినా అప్పు తీర్చలేదు. అసలువడ్డీతో సహా రెట్టింపైంది.

వాడింకేం తీరుస్తాడు ? తనకు ఒళ్ళు మండింది. పట్టుబట్టి నిలదీశాడు. నిప్పులు కక్కాడు. లక్షలాధికారైన తన మాట కెదురు చెప్పే వాళ్ళెవరూ ? ఇల్లు అమ్మి... ఆ డబ్బు తన చేతుల్లో ఉంచి

"మామూలు వడ్డీతో అప్పు తీరిపోయిందయ్యా !" చేతులు జోడించాడు. దీనంగా చూశాడు... కళ్లలోకి.

"గాడిద కొడకా !" తన కసహ్యమేసింది. నిప్పుల మీద నడిచినట్లైంది. "మామూలు వడ్డీకి అప్పులిచ్చేందుకు నువ్వేమన్నా నా అన్నవా, తమ్మునివా ? చక్రవడ్డీతో మిగతా డబ్బులు కక్కి కదులు..."

నర్సింలు దేవమ్మల కళ్ళు శ్రావణ మేఘాలైపోయినై.

"సరిపెట్టు కొండ్రయ్యా ! అమ్ముదామంటే మా దగ్గరింకేముందనీ ? "కొంగుతో కళ్ళద్దుకుంటున్న దేవమ్మ గుండెలు కదలి తరంగాల్లా ఎగసి పడినై. తన ఎక్సరే చూపులు అక్కడే తచ్చాడినై.

"అబద్ద మాడ్తావెందుకే ? అది బంగారందే గదా !"

"అయ్యో నీ బాంచనయ్యా ! పస్తులున్నప్పుడు గూడా దాన్ని తియ్యలేదు..." మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంది.

"అప్పుచేసి పప్పుకూడు తిన్నప్పుడు లేని బాధ ఇప్పుడెందుకో ! ఒరేయ్... ఇస్తావా ఛస్తావా !"

పెళ్ళాం మెడలో పసుపుతాడు కట్టేసి వణుకుతున్న చేతులతో తాళి బొట్టు తన చేతులుంచాడు. ఊళ్ళోకెలా వచ్చారో ఊరి బయటి కలాగే వెళ్ళారు.

కోతులు కొండముచ్చులు తిరిగే కొండ వాళ్ళకాశ్రయమిచ్చింది. ఆకులతో గుడిసె తయారైంది. అదే కూలి పని అన్నం బెట్టింది. బలహీన వర్గాలకు బంజరు భూమి పట్టా పథకములో ఎకరం భూమి లభించింది. పగలంతా ఇతరుల పొలాల్లో పంజేస్తూ రాత్రంతా రక్తాన్ని చెమటా మార్చి తమ పొలాన్ని సాగు జేసుకున్నారు. దానికి తోడు మరింత భూమి కొన్నారు. ఇద్దరు పిల్లలయాక గుడిశె ఇల్లుగా మారింది. కూలీ నర్సింలు కామందు నర్సింలయాడు. అయినా వానితో నాకేం పని అనుకున్నాడిప్పటి వరకు.

ఆహాహ! కొండమీద బంతి భోజనాలు... అన్నం.... అన్నం తింటున్నారంతా. నాగ్గూడా కొంచెం దొరికితే ఎంత బావుంటుంది ! అగ్నికీలలా విజృంభించిన ఆకలి పేగుల్ని కొరికేస్తుంది. ప్రాణాలు పరితపిస్తున్నాయి. గబగబా మెట్లు దిగి వచ్చాడు. అన్నపూర్ణ, సంతోషి గోడకొరిగి కూచున్నారు. చిన్నపిల్లలు పడుకుని మూల్గుతున్నారు.

"ఆకలమ్మా... ఆ...క...లే!" గిరిజ మెలికలు తిరిగి పోతూంది.

హయ్యో ! బార్యా పిల్లల ఆకలి తీర్చలేని అడారి వెధవనయ్యానే ! రెండు బుక్కలు తిన్న నాకే ఇట్లుంటే వాళ్లకెట్లుండాలె ! మళ్ళీ మెట్లు దిగి కిందికొచ్చాడు.

బజారంతా చిత్తడిగా ఉంది. గుండె గోడల్ని ఎగబాకుతూ ఏడుపు ఎగదన్నుకొస్తోంది.

ఇంట్లోని పదార్థాలన్నింటినీ ఊడ్చుకుపోయిన ఉప్పెన మమ్మల్ని గూడా ఈడ్చుకుపోతే ఈ దీనావస్థ ఉండేదిగాదు. డబ్బా, నగలు గూడా తినే పదార్థాలైతే ఎంత బాగుండు ! పోనీ ! డబ్బా, నగలన్నీ తీసుకెళ్ళి నర్సింలు కిచ్చేసి నాలుగు ముద్దలు అన్నం బెట్టమని అడిగితే !.... ప్చ్ !



కథా నిలయం
39579

లాభం లేదు. నడిబజార్లో వాని పరువు పంచనామా జేసి నిలువ నీడ లేకుండా చేసిన పాపాత్ముణ్ణి.

వాటినే తిని ఆకలి తీర్చుకో పొమ్మంటారు. గుప్పెడు మెతుకుల కెల్తే గూబ గుయ్యిమంటుంది. అక్కడున్న వాళ్ళెవ్వరూ తన మీద సానుభూతి చూపరు.

కాళ్ళు యాంత్రికంగా పిల్లల వద్దకు ఈడ్చుకెళ్ళినై.

గిరిజ తల్లి తొడమీద, ప్రహ్లాద్ సంతోషి ఒడిలో వాడిపోయిన కూరాకుల్లా.... బిత్తర చూపులు... భగవాన్ ! ఈ పాపాత్ముని అనుభవాలు పగవాడిగ్గూడా వద్దు...

"ఆ గూట్లో ఉంచిన ఎలుకల మందు గూడా కొట్టుకుపోయిందండీ. ఉంటే అదన్నా మనల్ని కడతేర్చేది.... నాకళ్ళముందే... నా పిల్లలకాగతి... హయ్యో !..." అన్నపూర్ణ తలబాదుకుంది.

"నాన్నా...! " సంతోషి పంచప్రాణాలు కళ్ళల్లో... ఏడ్చి ఏడ్చి కన్నీరై పోయినట్టుంది. "ఎన్నడన్నా దానధర్మాలు చేస్తే ఆ పుణ్యం ఇప్పుడు పనికొచ్చేదేమో నాన్నా !"

పావనమూర్తి గుండెలోతుల్లో గుండ్రాయంత బాంబు పేలింది.

ఆకాశంలో పెద్ద శబ్దం. హెలీకాప్టర్ కావచ్చు. మెట్లు దిగి కిందికొస్తుంటే ఇద్దరు మనుషులు పైకి చొచ్చుకొస్తున్నారు. వాళ్ళ మానాన వాళ్లనొదిలేసి బయటికొచ్చేశాడు. హెలీకాప్టర్ రాల్చిన రెండు పొట్లాల కోసం ఆరేడుగురు కొట్లాడుకుంటున్నారు. చాకచక్యంగా వెళ్ళి ఓ పొట్లమందుకోవాలనుకున్నాడు. కాని పొట్లం తన కందేలోగా నాలుగు చేతులు నాలుగువైపులా లాగాయి. పొట్లం పొట్ట చినిగింది. చిత్తడి నేలమీద పులిహోర మెతుకుల్ని ఆబగా ఎత్తుకుంటున్నారు.

వెనుదిరిగి ఇంట్లో కొస్తుంటే ఇందాకా తన ఇంటి పైకెళ్ళిన ఇద్దరు ఒకే పొట్లాన్ని విప్పుతూ బయటికొస్తున్నారు.

"ఆగండాగండి. ఇది నా డాబా మీది పొట్లం. నాగ్గూడా కొంచెమివ్వండీ !" చెయ్యి చాచాడు. చెయ్యిమీద ఒక్కటిచ్చి చెప్పాపెట్టకుండా పరిగెత్తారు.

ఎవరో చడీ చప్పుడే లేకుండా శవాన్ని మోసుకెల్తున్నారు.

మళ్ళీ ముసురు మొదలైంది. ఇహ శక్తి లేదు. వీపు తలుపుకానించి గడపలో కూచున్నాడు. భార్యా పిల్లలు గూడా కిందికొచ్చేశారు. తన పక్కనే పడిపోయారు. పావనమూర్తి చూపులు భూమ్మీద కేంద్రీకృతమైపోయినై.

.... అయిపోయింది, అంతా అయిపోయింది. ఈ లోకంలో నూకలు చెల్లిపోయినై. ఇన్నాళ్ళు బతికి ఇంటెనక చచ్చినట్టు.... ఇంత వయసొచ్చినా ఏమీ చెయ్యలేకపోయాను. ఇప్పుడేం కట్టుకు పోతున్నాను ?...

"అయ్యగారూ ! లేవుండ్రి. లోపలికి పదండ్రి !"

ఎప్పుడో విన్న గొంతు. నిండు మోట బొక్కెనలా తల భారంగా పైకి లేచింది. ఒకే గొడుగు కింద ఇద్దరు...

"అన్నపూర్ణమ్మా ! ఇటు చూడుండ్రమ్మా !"

అరె ! ఆశ్చర్యం. నర్సింలు దంపతులు. గిన్నెల్లో ఏదో మోసుకొచ్చారు. దేవమ్మ ఇస్తరాకు వేసి వడ్డిస్తోంది. వారెవ్వా ... అన్నం... హా ! వెండిరేకుల్లాంటి పాల నురగలాంటి తెల్లని బువ్వ... ప్రాణదానం చేసే అన్నం.

"తినుండ్రి ముందుగాల తినుండ్రయ్యా !"

ఇది కల అయియుంటుంది. చెంప గిల్లుకున్నాడు. కాదు, నిజమే. కలకాదు. అందరి నవనాడుల్లో చైతన్యం పుంజుకుంది. ఆశగా, ఆబగా, అరమరికల్లేకుండా తినేశారు.

ఐదు జతల కళ్ళు ఆమనిలో పూభామినుల్లా విచ్చుకున్నై. చూపులు దేవమ్మ వైపు....

ఒంటి నిండా ముదురాకు పచ్చ ముతక చీర, చేతుల నిండా పువ్వుల గాజులు. మొహం నిండా విచ్చిన పచ్చదనం... నుదుట ఎర్రని కుంకుమబొట్టు మీద నీలంరాయి ముక్కు పుడక వెలుతురు.

"దేవమ్మా ! నువ్వు దేవతవమ్మా !" అన్నపూర్ణ అమాంతం దేవమ్మను కౌగిట్లో బంధించింది.

"ఒరేయ్ నర్సింలూ ! నువ్వు... నువ్వు... నిజంగా... ప్రాణదాతవు, దేవుడివిరా !" తటాకములో పక్షుల రెక్కల్లా పావనమూర్తి కనురెప్పలు టపటపలాడినై. ఒకరి ముందెన్నడూ వంచని తల నర్సింలు పాదాలను తాకింది.

"అయ్యయ్యో ! మీరు పెద్దోళ్ళు.... నాకా కొండదారి చూపినోళ్ళు. మీరు సేమంగుండాలి" పావనమూర్తిని లేపి పాదాలందుకోబోయాడు.

ఆ ప్రయత్నాన్ని బలవంతంగా ఆపేసి బీరువా ముందు కెళ్ళాడు పావనమూర్తి. పెద్ద నగల మూట తెచ్చి నర్సింలు చేతిలో పెట్టేశాడు.

"నా అజ్ఞానాన్ని మన్నించురా, ఇవన్నీ తీసుకో, ఆకలి తీర్చలేని అలంకరణలు మట్టి గడ్డల కంటె హీనం ".

"వద్దు ఇవ్వన్నీ మనకెందుకూ ?" భయంతో నగల మూటను నెట్టేసింది దేవమ్మ. మూట విచ్చుకుంది. ఆవిడ కళ్ళు జిగేల్ మన్నై. అందులో తన మంగళసూత్రాలున్నాయి.

"అగ్గో... నా తాళిబొట్టు" భర్తకు చూపించింది. ఆనాటి పసుపు కొమ్ము దేవమ్మ మెడలో అలాగే వేళ్ళాడుతుంది.

"నీకు దండం బెడ్తరా ! కనీసం ఇదన్నా తీసుకోరా !" మంగళసూత్రాలు నర్సింలు కందించాడు పావనమూర్తి.

"పైసలిచ్చి తీస్కుందామయ్యా!" దేవమ్మ సలహా.

"వద్దమ్మా ! మీ అప్పు ఆనాడే తీరిపోయింది. మేమే మీకు ఋణపడున్నాం తల్లీ !" దేవమ్మ చేతులు పట్టుకు బతిమాలింది అన్నపూర్ణ. జలజలా రాల్తున్న కన్నీరా చేతుల్ని కడిగేస్తుంది.

పవిత్రమైన తాళి బొట్టును తాకట్టుకింద దక్కించుకున్నందుకు తగిన శాస్తి జరిగింది దేవమ్మా !"

"పంట ధాన్యం అమ్మి దానికి బంగారంది చేయిస్తాననుకున్నాను గాని.... ఇంగో... ఇప్పుడా గింజలు గిట్ల ఊరోళ్ళకుపయోగపడ్తున్నై... చేతులు జోడించాడు.

"గీ అన్నదానం నా పసుపు కుంకుమల్ని కాపాడుతుందమ్మా !" దేవమ్మ అంది.

మూడ్రోజుల క్రితం బండలాగున్న పావనమూర్తి గుండె కరిగి చెరువైపోయింది. బీరువాలో మిగిలున్న నగలన్నీ తెచ్చి వాటితో కలిపేశాడు.

"నర్సింలూ ! కూటికి సాటిరాని ఈ తాకట్టు నగలు ఎవరివి వారికిద్దాం పద !" పంచతో కళ్ళద్దుకున్నాడు.

మంగళ సూత్రాలు దేవమ్మ మెడలో వేస్తున్న నర్సింలు మొహం - అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడిలా వెలిగి పోతోంది.

"తాళిబొట్టు.... నా తాళిబొట్టు నాకొచ్చింది." అగ్రరాజ్యాల జాబితాలో చేరిపోయిన భారతమాతలా మురిసిపోతోంది దేవమ్మ.

"మా మంచి మావయ్య !" ప్రహ్లాద్ నర్సింలును చుట్టేశాడు.

"మా మంచి అత్తమ్మ !" సంతోషి, గిరిజలు దేవమ్మ చేతులు చెరొకటి పట్టుకున్నారు.

**జాగృతి వారపత్రిక, 1-7 ఫిబ్రవరి, 1999**